# పాలకుర్తి వాణి

మన పల్లె.. మన ముచ్చట్లు

సంపుటి : 01 | సంచిక : 163 | వరంగల్ | శనివారం, 14 మార్చి 2026 | పేజీలు : 02


## 16 నుంచి బడ్జెట్ సమావేశాలు

- అధికారులకు సీఎస్ ఆదేశాలు



**హైదరాబాద్, పాలకుర్తి వాణి :** ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలకు నేటిలోగా సమాధానాలు పంపాలని, ముఖ్యంగా నీటిపారుదల, వైద్య ఆరోగ్యం, మున్సిపల్ పరిపాలన, ఇంధన, రెవెన్యూ శాఖలకు సంబంధించిన ప్రశ్నలపై దృష్టి సారించాలని సూచించారు.

# ఎవరికీ అన్యాయం జరుగదు

- గాంధీ విగ్రహ ఏర్పాటుపై తప్పుడు ప్రచారం సరికాదు
- మూసీ పునరుజ్జీవంపై సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, పాలకుర్తి వాణి :** మన భవిష్యత్తు తరాల కోసం చేపడుతున్న మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు విషయంలో ఎవరికీ అన్యాయం జరగనివ్వమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చాలా స్పష్టంగా చెప్పారు. "ఈ ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం కాదు. ఏ పేదవాడికి అన్యాయం జరగదు. ఎవరి ఆస్తులను గుంజుకోవడం లేదు. మన అందరి భవిష్యత్తు కోసం చేపట్టిన ప్రాజెక్టు. హైదరాబాద్‌ను గొప్ప అభివృద్ధి చెందిన నగరంగా నిలబెట్టాలన్న ఆశయం. అందరూ సహకరిస్తేనే సాధ్యమవుతుంది. ముందుకు వెళ్లడానికి సూచనలు ఇవ్వండి". అని ముఖ్యమంత్రి కోరారు. మూసీ నది పునరుజ్జీవం ఫేజ్ 1 పై ప్రభుత్వం మూసీ ఇన్వైట్స్ పేరుతో ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్యమంత్రి ప్రసంగించారు. మూసీ చారిత్రక పరిణామాలు, ప్రాజెక్టు లక్ష్యాలు, దాని ఆవశ్యకతను వివరిస్తూ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడంలో ప్రజా ప్రతినిధులు, నిపుణులు, నిష్ణాతులు, పౌరులు తమ సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నిపుణులు, వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు హాజరైన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "ఈ ప్రాజెక్టు వల్ల ఎవరికీ అన్యాయం జరగదు. నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వడంపై సలహాలు సూచనలు ఇవ్వండి. మూసీ ప్రతిపాదిత ప్రాజెక్టు వెంట మొత్తంగా 10 వేల పేద కుటుంబాలున్నాయి. ఇప్పటికే డేటా సేకరించాం. వారందరికీ డబుల్ బెడ్రూమ్ ఇళ్లను సిద్ధం చేశాం. అయితే, దూరప్రాంతాలకు వెళ్లడం వల్ల చిన్న చిన్న పనులు చేసుకునే వారు ఉపాధి కోల్పోతామని అంటున్నారు. అందుకని సమీప ప్రాంతాల్లోనే ఇండ్లు కట్టించే ఏర్పాటు చేస్తున్నాం. ఎవరికీ నష్టం చేయం. వారితో నాకు శత్రుత్వం ఏముంటుంది. పేదల్లో దుఃఖాన్ని దూరం చేసే ప్రయత్నం చేస్తున్నాం. నా ఆలోచనలన్నీ పేదల వెంటే ఉన్నాయి. ఏ పేదవాడికి అన్యాయం చేయం. ఏ పేదవాడిని నిరాశ్రయులుగా చేయబోం. పేదలకు నష్టం కలిగించడానికి, కొంతమంది రియల్ ఎస్టేట్ సంస్థల ఆర్థిక ప్రయోజనాల కోసమో పనిచేయడం లేదు. ఈ రాష్ట్రాన్ని, నగరాన్ని గొప్ప అభివృద్ధి చెందిన నగరంగా నిలబెట్టాలని అనుకుంటోంది. ఇందులో మనమంతా భాగస్వాములం. చరిత్రను ఒకసారి గమనిస్తే, నది పరీవాహక ప్రాంతాల్లోనే నాగరికత విలసిల్లింది. నదులు, సముద్రం, నీటి ప్రవాహాలు ఉన్న ప్రాంతాలే అధికంగా అభివృద్ధి చెందాయి. థేమ్స్, హడ్సన్ నదులు, సింగపూర్, సియోల్, దుబాయ్, అహ్మదాబాద్ సబర్మతీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులు.. ఎన్నింటినో గమనించిన తర్వాత తెలంగాణ కూడా ఆర్థిక ప్రగతిని సాధించాలని, అభివృద్ధి నిరోధకులుగా ఉంటే భావి తరాలు క్షమించవని మూసీ రివర్ ఫ్రంట్ కార్యక్రమాన్ని చేపట్టాం. 1908లో మూసీకి ఉప్పెన వచ్చి వేలాది మంది మరణించిన సందర్భంలో ఆనాటి నిజాం వరద నివారణ, జంట నగర ప్రజల దాహార్తిని తీర్చడానికి వందేళ్ల కిందట ఒక గొప్ప విజన్‌తో ఉస్మాన్‌సాగర్, నిజాంసాగర్‌లను నిర్మించిన చరిత్రను విస్మరించరాదు. మన రాజకీయ అవకాశాల కోసం చరిత్రను కాలగర్భంలో కలిపేద్దామా. రాజకీయ ప్రయోజనం కోసం తప్పుడు ప్రచారం చేయొద్దు. ప్రాజెక్టుకు సహకరించకపోయినా పర్లేదు. కానీ అడ్డురాకండి. మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టుపై శాసనసభలో కూడా చర్చకు పెడతాం. అందరూ తమ అభిప్రాయాలు చెప్పాలి. అందరి సలహాలు స్వీకరిస్తాం. ప్రాజెక్టు కోసం ఎంతో కసరత్తు చేశాం. గ్లోబల్ టెండర్లు పిలిచి కన్సల్టెంట్లను నియమించామని తెలపారు. గాంధీ విగ్రహం కోసం 5 వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. గాంధీ విగ్రహం కోసం దాదాపు 75 కోట్లకు మించి ఖర్చు చేయడం లేదు. మొత్తం ప్రాజెక్టు 6500 నుంచి 7 వేల కోట్లకు మించి లేదు.. అని సీఎం వివరించారు. తొలుత ఈ సమావేశంలో మూసీ నది పూర్వోత్తరాలు, ప్రస్తుత స్థితిగతులు, నగర ప్రజల భవితవ్యం, నది పునరుజ్జీవం ఆవశ్యకత, అవసరం, ప్రపంచ వ్యాప్తంగా రివర్‌ఫ్రంట్‌ల ప్రాముఖ్యత, మూసీ రివర్‌ఫ్రంట్‌లోని ప్రధాన అంశాలతో పాటు River Musi Rejuvenation Phase1 సమగ్ర స్వరూపాన్ని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి గారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.


WANTED

విలేకరులు కావలెను

పాలకుర్తి వాణి దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, మండల విలేకరులు కావలెను. తెలుగు భాషపై పట్టు, ప్రజా సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి ఇదే మా ఆహ్వానం..

9866366702, 9963261745



# కొడుకుకు తలకొరివి పెట్టిన తల్లి

- ఆ తల్లి కడుపు కోతకు కారణమెవ్వరు?
- ప్రజల పలకరింపే తన ప్రేమ.. ఆప్యాయత
- కన్నీటి కడలిని అందించి కాటి దాకా పయనం
- శ్రీకాంత్ మృతి పై అనుమానాలు!



**పాలకుర్తి, పాలకుర్తి వాణి :** కొడుకే జీవితంగా బతికిన ఓ తల్లికి చివరికి ఆ కొడుక్కే తలకొరివి పెట్టవలసిన దౌర్భాగ్య పరిస్థితి వచ్చింది. తల్లి కడుపుకోత ఎవరు తీర్చలేరు. అప్పటికే భర్తను కోల్పోయిన ఆమె.. కొడుకు ఉన్నాడన్న ఆశతో బతికింది. ఆశలన్నీ ఆ కొడుకుపైనే పెట్టుకుంది. భర్తను తీసుకుపోయిన ఆ దేవుడికి ఆమెపైనా ఇంకా కోపం తగ్గలేదేమో.. చేతికందే వయసులో (36) ఏళ్లు వచ్చినా తన కొడుకును కూడా కోల్పోయేలా చేశాడు. ఏ కాకైనా ఆమె చివరికి తన కొడుక్కి తలకొరివి పెట్టవలసిన గతి పట్టింది. ఒక తల్లికి ఇంతకు మించిన గుండెకోత మరోటి ఉండదేమో.. ఈ సంఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన కమ్మగాని (తమ్మడపల్లి) యాకలక్ష్మి (క్రీస్తు శే: దేవయ్య గౌడ్) కొడుకు అనుకోని విధంగా ఆత్మహత్యకు పాల్పడ్డారు. సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేసుకునే ఆయన ఫ్యాన్ కు ఉరి వేసుకొన్నాడు. తన ప్రాణం అనుకున్న కొడుకు మరణ వార్త విని తల్లి తల్లడిల్లింది. ఒక్కగానొక్క కొడుకు చనిపోవడంతో అతని దహన సంస్కారాలు తల్లి యాకలక్ష్మి బరువైన గుండెతో నిర్వహించారు. నలుగురు అయ్యో అనుకునే విధంగా మానవత్వాన్ని చాటుకున్నారు. రక్తసంబంధంతో పాటు తల్లి బిడ్డల బంధాన్ని మృత్యువు వేరు చేయడంతో ప్రాణం అనుకున్న కొడుకు చితికి నిప్పు పెట్టి తుది వీడ్కోలు పలికింది ఆ తల్లి. ఒక్కగానొక్క కొడుకు దూరం కావడంతో రోదిస్తున్న తల్లిని చూసి స్థానికులు కన్నీరు మున్నీరుగా విలపించారు. తన స్నేహితులు అన్ని తామై ముందుండి అంతిమ యాత్రను నిర్వహించారు. కల్మషం లేని శ్రీకాంత్ అంతిమయాత్రలో వందలాదిగా బంధువులు, బలగాలు, స్నేహితులు పాల్గొన్నారు. అటు శ్రీకాంత్ మృతి పై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హత్యనా? ఆత్మహత్యనా? అనేది తేలాల్సి ఉండగా పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.

## సీఎం రేవంత్ రెడ్డికి అల్లు అర్జున్ ధన్యవాదాలు



**హైదరాబాద్, పాలకుర్తి వాణి :** 'అల్లు సినిమాస్' ప్రారంభోత్సవానికి విచ్చేసిన సీఎం రేవంత్ రెడ్డికి నటుడు అల్లు అర్జున్ ధన్యవాదాలు తెలిపారు. 'మా నాన్న అల్లు అరవింద్ నిర్మాతగా ఇండియన్ సినిమా బాక్సాఫీస్ స్థాయిని పెంచారు. తెలుగు రాష్ట్రాల్లో సినిమా డిజిటల్‌లో ఉందంటే అందుకు ప్రధాన కారణం అల్లు అరవింద్' అని అన్నారు. కాగా హైదరాబాద్ కోకాపేటలో 'అల్లు సినిమాస్' మల్టీప్లెక్స్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు.



## కలెక్టర్ ఎమ్మెల్యే బిజీ బిజీ పర్యటన

పాలకుర్తి, పాలకుర్తి వాణి: జాతీయ పశు వ్యాదుల నివారణలో భాగంగా జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గాలికుంటు వ్యాధి టీకాలకు శ్రీకారం చుట్టారు. పాలకుర్తి మండలం అయ్యగారిపల్లిలో మెగా క్యాంపును ఏర్పాటు చేశారు. శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రారంభించారు. 200 గేదె, ఆవు జాతి పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలను అలాగే 50 పశువుల కు వివిధ రకాల చికిత్సను అందించారు. సుమారు 50 మంది పాడి రైతులకు కాల్షియం సిరప్, ఖనిజ లవణల మిశ్రమ ప్యాకెట్ లను అందించారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా పశు, వైద్య శాఖ అధికారి డాక్టర్ మురళీధర్ రావు, AD లు డాక్టర్ రంజిత్, డాక్టర్ సారంగపాని, డాక్టర్ దేవేందర్, మండల పశు వైద్య అధికారి డాక్టర్ అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

## కేవీపీఎస్ డైరీ ఆవిష్కరణ



**పాలకుర్తి టౌన్, పాలకుర్తి వాణి :** జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (KVPS) 2026 డైరీని సిఐ జానకి రామ్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మహనీయులు అంబేద్కర్, జ్యోతి రావు పూలే, పెరియార్ కలలుకన్న సమానత్వం సమసమాజ నిర్మాణం కావాలంటే నేటి సమాజంలో రాజ్యాంగబద్ధంగా కులాంతర మతాంతర వివాహాలు జరగాలన్నారు. రాష్ట్రంలో సామాజిక ఉద్యమాలు రూపకల్పనలో కెవిపిఎస్ ముందంజలో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, రజక సంఘం అధ్యక్షుడు మదారు, కేవీపీస్ జిల్లా కమిటీ సభ్యులు కాకర్ల రమేష్, నకిరేకంటి స్వామి, తాటికాయల జానీ, కాకర్ల బాబు పాల్గొన్నారు.

## బాధ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



**పాలకుర్తి టౌన్, పాలకుర్తి వాణి :** పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన కమ్మగాని శ్రీకాంత్ హైదరాబాదులో మృతి చెందగ.. వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి. శ్రీకాంత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి వారి దుఃఖంలో భాగస్వామ్యం అయ్యారు. కమ్మగాని శ్రీకాంత్ అకాల మరణం కుటుంబానికి మాత్రమే కాకుండా గ్రామానికి కూడా తీరని లోటని పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, వారికి అవసరమైన సహాయం అందించేందుకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## ఏబీఎన్ రిపోర్టర్‌కు మాజీ మంత్రి పరామర్శ

**పాలకుర్తి టౌన్, పాలకుర్తి వాణి :** జనగామ జిల్లా పాలకుర్తి ABN రిపోర్టర్ మహమ్మద్ పాషా తండ్రి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకొని మల్లంపల్లిలోని వారి నివాసానికి వెళ్లి కలిసి పాషా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని, సంతాపం తెలియజేశారు ఎర్రబెల్లి దయాకర్ రావు. సర్పంచి పోశాల వెంకన్న, మండల అధ్యక్షుడు నవీన్ పాల్గొన్నారు.






## మృతుడి కుటుంబానికి ఎర్రబెల్లి భరోసా

**పాలకుర్తి టౌన్, పాలకుర్తి వాణి :** పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన కమ్మగాని శ్రీకాంత్ మరణించిన విషయం తెలుసుకుని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వారి ఇంటికి వెళ్లి శ్రీకాంత్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపి కుటుంబానికి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. నవీన్, నాగిరెడ్డి, నాగన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

జనగామ, పాలకుర్తి వాణి: అడిషనల్ కలెక్టర్ బెన్ షాలోమ్ శుక్రవారం జనగాంలోని TSWRS, ప్రభుత్వ BC కాలేజీ బాయ్స్ హాస్టల్‌ను పరిశీలించారు. కిచెన్, స్టాక్ రిజిస్టర్లు (రైస్, పప్పు దినుసులు, ఆయిల్ etc.), అటెండన్స్ రిజిస్టర్ (staff) ను పరిశీలించారు. విద్యార్థులకు సరైన వసతులు సౌకర్యాలు ఉన్నాయా? ఇతరత్రా అంశాలపై ఆరా తీశారు. పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలని, విద్యార్థులకి నాణ్యమైన భోజనం అందించాలన్నారు

Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341